

ఓట్ల కోసం పాట్లు

- సనత్‌నగర్ నియోజకవర్గంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కోవర్గం ఓటర్లు
- ఏరియాకో ప్రత్యేకం
- ఆయా ప్రాంతాలపై వల విసిరేందుకు సిద్ధమవుతున్న నేతలు

సనత్‌నగర్: మిగతా సమయాల్లో ఎలా భావించినా.. ఎన్నికల వేళ నేతలకు ఓటరే దేవుడు. అలాంటి ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకునేందుకు వారు ఎన్ని దారులైనా అన్వేషించాల్సిందే. పడరాని పాట్లు పడాల్సిందే. ఎన్నికలు ఏవైనా, పార్టీ ఏదైనా ప్రాంత, కుల, మత సమీకరణాలను బేరీజు వేసుకుని ఆయా వర్గాల ఓట్లకు గాలం వేయడం పరిపాటి. సనత్నగర్ నియోజకవర్గం విషయానికొస్తే ఒక్కో ప్రాంతంలో ఒక్కో వర్గం ఓట్లు 'కీ'లకమనే చెప్పాలి. ఆ ఓటర్లే అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేస్తారనేది రాజకీయ విశ్లేషకుల అంచనా. అందుకే ఏ పార్టీ అభ్యర్థి అయినా వారి మన్ననలు పొందేందుకు ఉవ్విళ్లూరుతుంటారు. ఈ క్రమంలో ఏ ప్రాంతంలో ఏ ఓటర్లు ఉన్నారనే దానిపై ప్రత్యేక కథనం.

సింధీల అడ్డా.. సింధీకాలనీ..

బేగంపేట డివిజన్ పరిధిలోని సింధికాలనీ సింధీ ప్రాంతీయులకు నెలవు. సింధీ ప్రాంతం నుంచి వచ్చిన కుటుంబాల ఆవాసం కోసం ఏర్పడినదే సింధీకాలనీ. ఒకప్పుడు 500 కుటుంబాల నివసించే సింధీకాలనీలో ఈ ప్రాంతంలో వాణిజ్యపరంగా మారడంతో ప్రస్తుతం 200–250 కుటుంబాలు నివసిస్తున్నట్లు అంచనా. ఈ ప్రాంతంలో కేటాయించిన రెండు బూత్‌లలో అగ్రభాగం ఆ కమ్యూనిటీకి చెందిన ఓటర్లే ఉండడం గమనార్హం. దాదాపు 1200 మంది సింధి ఓటర్లు ఆయా బూత్‌లలో ఓటు హక్కు వినియోగించుకుంటుంటారు.

బొహ్రా ముస్లింలకు నెలవు.. సిల్వర్ జూబ్లీ అపార్ట్‌మెంట్..

బేగంపేట డివిజన్ పరిధిలోని సిల్వర్ జూబ్లీ అపార్ట్‌మెంట్ పేరు వినగానే అక్కడంతా బొహ్రా ముస్లింల కుటుంబాలే ఉంటాయని స్ఫురణకు వస్తోంది. ఈ ఒక్క అపార్ట్‌మెంట్‌లోనే 250 బొహ్రా ముస్లింల కుటుంబాలు నివసిస్తున్నాయి. అపార్ట్‌మెంట్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలను కలుపుకుంటే దాదాపు 1500 మంది బొహ్రా ముస్లిం ఓటర్లు ఉంటారనేది ఒక అంచనా.

లంబాడీల ఇలాకా బాపునగర్..

అమీర్‌పేట డివిజన్ బాపునగర్ అంటే లంబాడీల ఇలాకా. ఆ పార్టీ, ఈ పార్టీ అని తేడా లేకుండా బాపునగర్ ఓటర్ల చూపును తమపై ప్రసరింపజేసుకునేందుకు ఎంతగానో పాట్లు పడుతుంటారు. ఈ ఒక్క బస్తీని ఆధారం చేసుకుని ఒకానొక సమయంలో మున్సిపల్ ఎన్నికల్లో అమీర్‌పేట డివిజన్‌ను ఎస్టీ రిజర్వ్ చేశారు. ఈ ప్రాంతంలో 2500–3000 మంది వరకు లంబాడీల ఓట్లు ఉండవచ్చు.

సిక్కులకు కేరాఫ్.. అమీర్‌పేట సిక్కువాడ..

సిక్కు కమ్యూనిటీకి కేంద్ర బిందువు సిక్కువాడ. ఇక్కడి పవిత్ర గురుద్వారా సాక్షిగా ఎన్నో కుటుంబాలు నివసిస్తూ ప్రబంధక్ కమిటీ నేతృత్వంలో సేవా కార్యక్రమాలను చేస్తుంటారు. దాదాపు రెండు వేల వరకు సిక్కు కమ్యూనిటీ ఓట్లు ఉంటాయనేది ఓ లెక్క. ఇక్కడి ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు అభ్యర్థులు విశ్వ ప్రయత్నాలు చేస్తుంటారు.

సెటిలర్స్ ఓటు బ్యాంకుకు చిరునామా..

నియోజకవర్గంలో ప్రధాన ఓటు బ్యాంకుగా ఉన్న సెటిలర్స్‌కు చిరునామాగా కొన్ని కాలనీలు ఆవిర్భవించాయి. ముఖ్యంగా సనన్‌నగర్ డివిజన్ పరిధిలోని జెక్కాలనీ, సుందర్‌నగర్, మోడల్‌కాలనీ, అమీర్‌పూట డివిజన్ పరిధిలోని లీలానగర్ ప్రాంతాలు సెటిలర్స్‌కు నెలవుగా ఉన్నాయి. ఆయా కాలనీల్లో 95 శాతం సెటిలర్స్ ఓటు బ్యాంకే ఉండడంతో అభ్యర్థుల గెలుపోటములను నిర్దేశిస్తారనేది జగమెరిగిన సత్యం.

ఎంజీ రోడ్డులో పార్శీలు..

రాంగోపాల్పేట డివిజన్ ఎంజీరోడ్డులోని ఫైర్ టెంపుల్ ఎదురుగా పార్శీల ఓటు బ్యాంకు ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ దాదాపు 50 కుటుంబాల వరకు ఉంటాయి.

కళాసీగూడ, టకారాబస్తీల్లో బెంగాలీలు..

నియోజకవర్గంలోని కళాసీగూడ, టకారాబస్తీల్లో బెంగాలీల ఓట్లు కీలకంగా ఉన్నాయి. గోల్డ్‌స్మిత్‌లుగా స్థిరపడ్డ ఆయా కుటుంబాల ఓట్లను కొల్లగొట్టేందుకు రాజకీయ పార్టీలు ఎత్తులకు పైఎత్తులు వేస్తుంటాయి. మొత్తం మీద ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా వర్గాల ఓట్లను తమ ఖాతాలో వేసుకునేందుకు అభ్యర్థులు ఏ మేర పాట్లు పడతారో వేచి చూడాల్సిందే మరి.



నార్త్ ఇండియన్స్‌కు కేరాఫ్ పీజీ రోడ్డు..

పీజీ రోడ్డుకు ఓ వైపు రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్, కృష్ణానగర్‌తో పాటు మరోవైపు బేగంపేట డివిజన్‌లోని సిల్వర్ జూబ్లీకాలనీ, సింధికాలనీలో నార్త్ ఇండియన్స్ ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. పీజీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆయా ప్రాంతాల్లో 12,000 వరకు నార్త్ ఇండియన్స్ ఓట్లు ఉన్నాయనేది ఒక అంచనా. దీనికి తోటు సనత్‌నగర్ డివిజన్ లోధా అపార్ట్‌మెంట్‌లో మెజార్టీ శాతం నార్త్ ఇండియన్స్ ఓట్లే ఉన్నాయి. అసెంబ్లీ, పార్లమెంట్, జీహెచ్‌ఎంసీ..ఇలా ఎన్నికలు వచ్చి ప్రతిసారీ నేతలు ఇక్కడి నార్త్ ఇండియన్స్ ఓట్లపై వల విసురుతుంటారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి



పద్మారావుగౌడ్‌ను ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు

అడ్డగుట్ట: గడిచిన తొమ్మిదిన్నర ఏళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తన విజయానికి బాటలు వేస్తాయని సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం అడ్డగుట్ట డివిజన్ పరిధిలోని లాలాగూడ, శాంతినగర్ ప్రాంతాల్లో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటిస్తూ మాట్లాడారు. కేసీఆర్ ముఖ్యమంత్రి, తాను సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ కొడతామని ధీమా వ్యక్తం చేశారు. అడ్డగుట్టలో కీలక సమస్యలు పరిష్కరించామని, 50 ఏళ్లుగా కాగితాలకే పరిమితమైన తుకారాంగేట్ ఆర్‌యూబీ నిర్మాణ పనులు తమ హయాంలోనే పూర్తయ్యాయన్నారు. అడ్డగుట్టలో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి రూ. 13.05 కోట్ల నిధులను మంజూరు చేసి ఇటీవలే పనులకు శంకుస్థాపన చేశామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పాటు పడుతూనే ఉన్నామని మరోసారి తమకు అవకాశం కల్పించాలని ప్రజలను కోరారు. ఈ ప్రచారంలో కార్పొరేటర్లు లింగాని ప్రసన్నలక్ష్మి, శైలజ, నేతలు లింగాని శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, నక్క మధు, మనోహర్, గీతా దయాకర్, పొన్నాల రాజు, అమర్, దొమ్మేటి శివ, మైనారిటీ నాయకులు హాషమ్, జావీద్, అజీమ్ పాల్గొన్నారు.

పోలింగ్ ఏజెంట్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: తమకు కేటాయించిన బూత్‌లలోని ఓటర్ల ఇళ్లకు వెళ్లి ప్రతి ఒక్కరూ ఓటేసేలా అవగాహన కల్పించాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. మారేడ్‌పల్లిలో బుధవారం జరిగిన నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ పోలింగ్ ఏజెంట్ల అవగాహన సమావేశానికి మంత్రి హాజరై మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ, అభ్యర్థి గెలుపులో పోలింగ్ ఏజెంట్ల పాత్ర కీలకమన్నారు. నియోజకవర్గ పరిధిలో వారి వారి ప్రాంతాల్లో చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించాలని చెప్పారు. 80 ఏళ్ల పైబడిన వారికి ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందని, అలాంటి వారిని గుర్తించాలన్నారు. ఓటరు నమోదు, బూత్ మార్పిడి వంటి ప్రక్రియ కోసం గతంలో అనేక ఇబ్బందులు ఉండేవని, ప్రస్తుతం ప్రత్యేక యాప్ అందుబాటులోకి వచ్చిందని, దానిని సద్వినియోగం చేసుకునేలా ఓటర్లకు వివరించాలన్నారు. తలసాని సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరిశ్రీహరి, హేమలత, శేషుకుమారి, రూప, కిరణ్మయి, పవన్‌కుమార్‌గౌడ్, కొలను బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎన్నికల ప్రచారం..

బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ మోండా డివిజన్ నుంచి ఈ నెల 19 గురువారం తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్నారు. బండిమేట్ నుంచి ప్రారంభం అయ్యే ప్రచారం మారుతీవీధి, నాలా బజార్, ఓల్డ్ జైల్ తదితర ప్రాంతాల్లోని ఓటర్లను కలువనున్నారు. ఈ నెల 26న గొల్లకొమురయ్య కాలనీ, గాంధీనగర్, రామస్వామి కంపౌండ్, బర్కల్‌బస్తీ, 27న పద్మారావునగర్ ప్రాంతాల్లో ప్రచారం ఉంటుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

సాయన్న బిడ్డగా మీ ముందుకు వస్తున్నా ఆశీర్వదించండి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న లాస్యనందిత

రసూల్‌పురా: దివంగత నేత సాయన్న బిడ్డగా మీ ముందుకు వచ్చానని తనను ఆశీర్వదించాలని కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్య నందిత ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం బోర్డు ఎనిమిదవ వార్డు బొల్లారంలోని పలు బస్తీల్లో పాదయాత్ర చేశారు. బొల్లారం మహంకాళి ఆలయంలో పూజలు నిర్వహించి రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్, బోయిన్‌పల్లి మార్కెట్ వైస్ చైర్మన్, బోర్డు మాజీ సభ్యుడు లోక్‌నాథ్‌తో కలిసి రిసాలబజార్, దర్జీబస్తీ, జెండా బస్తీ, పెన్షన్‌పురా, యాదవ బస్తీల్లో ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిశారు. గజ్జెల నాగేష్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పేద ప్రజల సంక్షేమం కోసం ప్రకటించిన మేనిఫెస్టో హామీలు తప్పనిసరి నెరవేరుస్తారని ఈ సారి ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు అధికారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జక్కుల మహేశ్వర్‌రెడ్డి, నివేదిత, రవి కుమార్, వెంకటేష్, మురళియాదవ్, ఉదయ్, ఉమేష్, ప్రభుగుప్త, రవీందర్ గుప్తా, టీఎన్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: గ్రీన్‌ల్యాండ్స్ సబ్‌డివిజన్ బేగంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉటుందని ఏడీఈ బానోతు చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇంది రాగాంధీపురం, బేగంపేట బస్తీ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

కాంగ్రెస్ టికెట్ స్థానికులకే ఇవ్వాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీబీ దేవేందర్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ కాంగ్రెస్ టికెట్ స్థానికులకే కేటాయించాలని ఆ పార్టీ సీనియర్ నేత డీబీ దేవేందర్ డిమాండ్ చేశారు. బుధవారం పికెట్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కష్టకాలంలో పార్టీని కాపాడుకుంటూ కార్యకర్తలకు అండగా ఉన్న వారిని విస్మరించి, స్థానికేతరులకు టికెట్ ఇస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. 1999లో కాంగ్రెస్ తరఫున బరిలో దిగి 67వేల పైచిలుకు ఓట్లు సాధించిన తనకు మరో అవకాశం ఇవ్వాలన్నారు. తనకు టికెట్ నిరాకరిస్తే ఇతర పార్టీల నుంచి పోటీ చేస్తానన్నారు. గద్దర్ కుమార్తెకు అధికారంలోకి వచ్చాక ఎంపీ లేదా ఎమ్మెల్సీ ఇవ్వాలి తప్ప, స్థానికేతరురాలు అయిన ఆమెకు ఇక్కడ టికెట్ ఇవ్వొద్దన్నారు. మాదిగ వర్గానికి చెందిన ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నందున కంటోన్మెంట్ టికెట్ మాదిగలకే కేటాయించాలన్నారు. అధిష్ఠానం తగిన నిర్ణయం తీసుకోకపోతే కంటోన్మెంట్‌లో ఓటమి తప్పదన్నారు.

బీఆర్‌ఎస్ ఎన్నికల కార్యాలయం ప్రారంభం



బన్సీలాల్‌పేట్: రానున్న ఎన్నికల్లో సనత్‌నగర్‌లో గులాబీ జెండా ఎగురడం ఖాయమని బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పద్మారావునగర్‌లో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ఎన్నికల కార్యాలయాన్ని బుధవారం ఆయన ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో చేపట్టి అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు తన విజయానికి సోపానాలుగా నిలుస్తాయన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి బీఆర్‌ఎస్ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కోరారు. అంతకు ముందు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పద్మారావునగర్ ప్రధాన రహదారిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్పొరేటర్ కె. హేమలత, ఏసూరి మహేష్, వెంకటేషన్, వెంకటరమణ, సురేష్, శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, ముక్కా శ్రీనివాస్, శ్రీనివాస్, హరిచారి పాల్గొన్నారు.

క్లుప్తంగా...

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో అధ్యాపకుల కొరతతో పార్ట్‌టైం అధ్యాపకుల నియామకాలకు నోటిఫికేషన్ వెలువడింది. క్యాంపస్ కాలేజీలతో పాటు అనుబంధ నిజాం కాలేజీ, ఇతర పీజీ కాలేజీల్లో వివిధ సబ్జెక్టులను బోధించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా నియామకాలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీలో జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌కు ఈ నెల 26 దరఖాస్తులు, నిజాం కాలేజీలో కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఇన్ఫర్మేటిక్స్/ కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టుల్లో బోధించేందుకు ఈ నెల 21 వరకు దరఖాస్తు స్వీకరించనున్నట్లు తెలిపారు.

నేడు కల్యాణోత్సవం

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ 46వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈనెల 19వ తేదీ గురువారం ఉదయం 10.30 గంటలకు పద్మావతి గోదా సమేత ప్రసన్న వెంకన్నస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టామని ఈఓ రాజేష్‌కుమార్, అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావు తెలిపారు. బుధవారం ఉత్సవమూర్తులకు పట్టువస్త్రాలతో అలంకరించి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఉదయం 8.30 గంటలకు తిరుప్పావడ, రాత్రి 7 గంటలకు గరుడ వాహన సేవలు నిర్వహిస్తామన్నారు. చారుకేసి ఫైన్‌ఆర్ట్స్ సంస్థ ప్రతినిధి గోవింద్ లక్ష్మీపద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలతో పాటు శ్రీవారి కల్యాణాన్ని కనులారా వీక్షించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు. ఆలయ కమిటీ ప్రతినిధులు బాలభాస్కర్, లక్ష్మీనారాయణ, ఆత్మరామసూర్య సుబ్రహ్మణ్యం, నారాయణన్, శివశంకరన్, రామచందర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని కీస్ హైస్కూల్‌లో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వివేకానందపురం సికింద్రాబాద్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని పీఐడీ ఎల్ఆర్ సునిల్ కుమార్, లయన్ దీపక్ బట్టాచార్జ్, లయన్ మల్లారెడ్డి ప్రారంభించారు. వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు ఆస్పత్రి మార్కెటింగ్ హెడ్ వినోద్ కుమార్ తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగే వైద్య శిబిరాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చేతన బాటియా, దుర్గా వాణి సురభి, సాయి రాంరాజు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్

రసూల్‌పురా: సికింద్రాబాద్ జింఖానా మైదానంలో దసరాను పురస్కరించుకుని హునార్ మహోత్సవ్ ఎగ్జిబిషన్ కార్యక్రమం పేరుతో ప్రారంభమైన అరుదైన కళాఖండాల ప్రదర్శన ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శనలో వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు రూపొందించిన అప్లిక్ వర్క్, డ్రై ఫ్లవర్స్, జూట్ కేన్, ఇత్తడి ఉత్పత్తులు, చెక్క మట్టిబొమ్మలు, ఖాదీ ఉత్పత్తులు, వుడెన్ ఫర్నిచర్, రాజస్థానీ ఆభరణాలు, లెదర్ ఉత్పత్తుల స్టాళ్లు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయి. లైవ్ మ్యూజిక్, దాండియా కార్యక్రమాలు సైతం ఏర్పాటు చేశారు. సందర్శకులకు ఉచిత ప్రవేశం ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు.

'ప్రవల్లిక ఘటనలో కక్షపూరితంగా కేసులు'



మాట్లాడుతున్న జీవన్

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రవల్లిక ఆత్మహత్య అనంతరం ఆర్టీసీ క్రాస్‌రోడ్డు వద్ద రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్‌తో కలిసి ఆందోళన కార్యక్రమాలలో పాల్గొన్నందుకు తనపై కక్షపూరితంగా అక్రమ కేసులు పెట్టారని ఓయూ పరిశోధన విద్యార్థి, ఏబీవీపీ రాష్ట్ర నాయకులు జీవన్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగాల భర్తీలో జరుగుతున్న అవినీతి అక్రమాలు, గ్రూప్–1 పేపర్ లీకేజీ, రాత పరీక్షల రద్దు, టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన తదితర అంశాలపై వరుసగా ఆందోళనలు చేస్తున్న తనను టార్గెట్ చేసి ప్రవల్లిక ఘటనలో శాంతియుతంగా ఆందోళనలో పాల్గొనందుకు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. పేదరికాన్ని ఆసరగా చేసుకొని అమాయకులైన ప్రవల్లిక కుటుంబానికి డబ్బు, ఉద్యోగాన్ని ఎరగా చూపి కేసును తప్పుదోవ పట్టించారని బీఆర్‌ఎస్ నేతలు ఓట్లతో పాటు ప్రాణాలను సైతం డబ్బుతో కొంటున్నారన్నారు. ప్రవల్లిక ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమైతే గతంలో అనేక మంది ప్రేమ విఫలమై ఆత్మహత్యలు చేసుకున్నారని వారి కుటుంబాలకు ఎందుకు సహకరించలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు.


విశ్వరూప మహా పాదయాత్రను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్పీ నాయకులు

బౌద్ధనగర్: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం జరిగే పోరాటానికి సన్నద్ధం కావాలని ఎంఎస్పీ సికింద్రాబాద్ కోఆర్డినేటర్ డప్పు మల్లికార్జున్ పిలుపునిచ్చారు. పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ లేకపోవడంతో విద్యా, ఉద్యోగం, సంక్షేమ రంగాల్లో మాదిగ మాదిగ ఉప కులాల ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత సాధన కోసం మోసగిస్తున్న పాలకులతో తాడోపేడో తేల్చుకునేందుకు మందకృష్ణ మాదిగ చేపట్టిన అలంపూర్ టూ హైదరాబాద్ మాదిగల విశ్వరూప మహా పాదయాత్రను విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందులో భాగంగా నేడు (గురువారం) పాదయాత్ర గ్రేటర్ హైదరాబాద్‌కు చేరుకుంటున్న సందర్భంగా బాలాపూర్ చౌరస్తా నుండి ఎల్.బి. నగర్ వరకు చేపట్టే మాదిగల విశ్వరూప మహా పాదయాత్రకు మాదిగలు, మాదిగ ఉపకులాలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంఎస్పీ నాయకులు గజ్జల రాజశేఖర్, తుమ్మల శివప్రసాద్, దశరథ్, విక్కీ, చాగంటి యాదగిరి, కొప్పుల సాయి, రాజు, టింకు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురం



బతుకమ్మ ఉత్సవాల్లో మహిళలు

సనత్‌నగర్: జెక్‌కాలనీలో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రోజుకొక ప్రాంతంలో జరుగుతున్న వేడుకల్లో భాగంగా కాలనీ మూడో రోడ్డులోని కీర్తి హెవెన్ అపార్ట్‌మెంట్ వద్ద బుధవారం కాలనీకి చెందిన మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారుచేసి ఒకచోట పేర్చి సందడి చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు చింతిరెడ్డి ప్రభ, ప్రధాన కార్యదర్శి, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎస్.అన్నపూర్ణతో పాటు ఆదిలక్ష్మీదేవి, కేవీ రమణమ్మ, భాగ్యలత, విజయలక్ష్మీ, వాణి ఉత్సవ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో అనంతరెడ్డి, సుబ్బరాజు, విశ్వనాధరాజు, మల్లారెడ్డి పాల్గొన్నారు.



సేవాభాయ్ సేవా సంఘం ఉత్సవ కమిటీ అమ్మవారి సేవలో కార్పొరేటర్ కొంతం దీపిక



తార్నాక చింతల్‌లో అమ్మవారి పూజలో పాల్గొన్న బండా చంద్రారెడ్డి

జగన్మాతా పాహిమాం..

శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సికింద్రాబాద్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లోని అమ్మవారి మండపాల్లో భక్తుల సందడి నెలకొంటోంది. ఆయా మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవార్లు రోజుకొక రూపంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు తగు సౌకర్యాలు కల్పించారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆయా మండపాలను సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

–సికింద్రాబాద్, సనత్‌నగర్ జోన్ల బృందం



మేడిబావిలోని నల్లపోచమ్మ ముత్యాలమ్మ దేవాలయంలో సామూహిక కుంకుమార్చన



బేగంపేట కట్టమైసమ్మ ఆలయంలో భక్తుల పూజలు



సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో దుర్గాదేవిని దర్శించుకున్న మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి

బీఆర్‌ఎస్ అభ్యర్థికి మద్దతుగా నిలుస్తాం

సనత్‌నగర్: నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు తాము మద్దతుగా నిలుస్తామని ఎంఐఎం సనత్‌నగర్ ఇన్‌చార్జి షౌకత్ స్పష్టం చేశారు. దారుస్సలాంలో ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ బుధవారం సనత్‌నగర్ నియోజకవర్గ నేతలతో సమావేశమయ్యారని, ఇక్కడి రాజకీయ పరిస్థితులపై చర్చించడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఎంఐఎం అధిష్ఠానం ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు కోసం తాము కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో షకీల్‌బేగ్, అశోక్, శుకుర్, అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ అసమ్మతి నేతల సమావేశం

సికింద్రాబాద్: కాంగ్రెస్ అభ్యర్థిత్వం ఖరారు విషయంలో నిరాశకు గురైన కాంగ్రెస్ నాయకులు ఈనెల 19న సమావేశం నిర్వహించనున్నారు. సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి టికెట్ ఆశించి కాంగ్రెస్ నాయకుడు నోముల ప్రకాశ్ భంగపడ్డారు. ఇక్కడి అభ్యర్థిత్వాన్ని మరో కాంగ్రెస్ నాయకుడు ఆదం సంతోష్‌కుమార్‌కు కట్టబెట్టారు. ఈ విషయాన్ని జీర్ణించుకోని నోముల ప్రకాశ్‌రావుతో పాటు ఆయన వర్గీయులు సీతాఫల్‌మండిలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. సికింద్రాబాద్ ఏ,బీ బ్లాక్ డివిజన్ల అధ్యక్షులు జగదీశ్వర్, సురేశ్‌లాల్, మాజీ కార్పొరేటర్ ఎంఆర్ శ్రీనివాస్‌రావుతోపాటు ఐదు డివిజన్లకు చెందిన పలువురు నాయకుల నేతృత్వంలో అసమ్మతి సమావేశాన్ని నిర్వహించనున్నారు. తాము ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక సమావేశంలో తమకు అండగా నిలిచిన కార్యకర్తలు, అన్ని డివిజన్ల నాయకుల సలహాలు సూచనలు తీసుకుని తదుపరి నిర్ణయం తీసుకుంటామని నోముల ప్రకాశ్‌రావు తెలిపారు.

సనత్‌నగర్‌లో బీజేపీ జెండా ఎగరవేస్తాం

సనత్‌నగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని తరిమికొట్టే సత్తా బీజేపీకే ఉందని, సనతనగర్ నియోజకవర్గంలో విజయం సాధించి ఆ పార్టీ చరిత్ర సృష్టించనున్నదని మాజీ మంత్రి, సీనియర్ నేత మర్రి శశిధర్ రెడ్డి అన్నారు. సనత్‌నగర్‌లో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజాకర్షక పాలన రాష్ట్రంలో సైతం అధికారాన్ని తీసుకువస్తుందన్నారు. తమ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం అందరూ సమష్టిగా కృషి చేస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందన్నారు. బీఆర్‌ఎస్‌ను ఎదుర్కొనే బలం లేక చతికిలపడిపోయిందన్నారు. లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ విషయంలో మంత్రి తలసాని అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటే తాను పోరాడి పీఏఫ్ అధికారులను ఒప్పించి ఆ స్థలంలో నిర్మాణం జరిగేలా ఒత్తిడి తీసుకొచ్చానన్నారు. బీజేపీకి సంప్రదాయ ఓటింగ్‌తో పాటు ప్రభుత్వ వ్యతిరేక ఓటింగ్‌తో తాము భారీ మెజార్టీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రాంగోపాల్‌పేట్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎస్పీరోడ్‌లోని జురాస్ట్రియన్ క్లబ్ వద్ద ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వివరాలపై ఆరా తీశారు. మృతుడికి 35–40 ఏళ్లు ఉంటుందని నలుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కుడి చేతిపై మింటూ లాల్ అనే ట్యాట్ ఉందని సంబంధీకులు ఎవరైనా ఉంటే రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.